సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం । 23 । నవంబర్ । 2024



జోగుళాంబ వారోత్సవాలు..
జోగుళాంబ ఆలయంలో వారోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.
వివరాలు 8లో ▸



ప్రారంభం.. ఆలస్యం
జడ్చర్లలో నిర్మించిన ఆర్‌యూబీ ప్రారంభం మరింత ఆలస్యమవుతోంది.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.7 /12.8

వాతావరణం
చలి తీవ్రత పెరుగుతుంది. ఉదయం, రాత్రి వేళల్లో చల్లనిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: వచ్చేనెల 1వ తేదీన మంచిర్యాలలో జరిగే 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ (8, 10, 12 ఏళ్ల లోపు బాలబాలికల) అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను ఈనెల 24వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తహసీల్దార్ ద్వారా కులధ్రువపత్రం, మున్సిపాలిటీ ద్వారా జననపత్రంతో హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం 9492177535 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఫార్మసీ రంగంలో ఉజ్వల భవిష్యత్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఫార్మసీ రంగంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పీయూలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టులది కీలక పాత్ర అని, ఫార్మసిస్టులు తప్పకుండా డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ రాతను అర్థం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ప్రిన్సిపాల్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు రిపోర్టు రూపొందించేందుకు కమిటీ

పీయూలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేకంగా రిపోర్టు రూపొందించాలని కోరుతూ పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కమిటీలో చైర్మన్‌గా అంకం భాస్కర్, కన్వీనర్ రవీందర్, సంధ్యారాణి, శ్రీధర్‌రెడ్డి, రాఘవేందర్, ఆంజనేయులు, బలీక్ ఉద్దీన్ తదితరులు సభ్యులుగా ఉన్నారు.

ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ రూ.2761

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్‌లో శుక్రవారం ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ గరిష్ఠంగా రూ.2,761, కనిష్ఠంగా రూ.1,656 ధరలు దక్కాయి. అదేవిధంగా మొక్కజొన్న క్వింటాల్ గరిష్ఠంగా రూ.2,416, కనిష్ఠంగా రూ.2,124, హంస రకం గరిష్ఠంగా రూ.2,209, కనిష్ఠంగా రూ.1,801, జొన్నలు రూ.3,077, వేరుశనగ రూ.6,309 ధరలు లభించాయి.

■ దేవరకద్ర మార్కెట్ యార్డులో ఆర్‌ఎన్‌ఆర్ వరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,679 కనిష్ఠంగా రూ.2,049 లభించింది. మార్కెట్‌కు దాదాపు 2వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.



మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ విచారణలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, చిత్రంలో కమిషన్ సభ్యులు రంగు బాలలక్ష్మి, రాపోలు జయప్రకాశ్, తిరునగరి సురేందర్, కలెక్టర్లు విజయేందిర, ఆదర్శ్‌సురభి, బదావత్ సంతోష్, తదితరులు

బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిందే..

జనాభా దామాషా ప్రకారం ప్రాధాన్యం ఇవ్వాలి

- వివిధ సంఘాల డిమాండ్.. కమిషన్‌కు వినతుల వెల్లువ
- బీసీల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులపై బహిరంగ విచారణ
- అర్జీలను స్వీకరించిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- ఉమ్మడి జిల్లా నుంచి 135 వినతులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ కులాల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంఘాలు, కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్య పరమైన స్థితిగతులపై బీసీ కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలు, బీసీ, కుల సంఘాల నాయకుల నుంచి కమిషన్ చైర్మన్ నిరంజన్ వినతులను స్వీకరించారు. బీసీ క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని పలు సంఘాలు కోరాయి. దీంతో పాటు ఈడబ్ల్యూఎస్‌తో బీసీలకు **అన్యాయం జరుగుతుందని.. దాన్ని వెంటనే రద్దు చేయాలని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. రాజకీయ ప్రాతినిధ్యం లేని కులాలు చాలా ఉన్నాయని.. వాటికి కూడా రిజర్వేషన్ల ద్వారా రాజకీయ ప్రాధా**న్యత ఇవ్వాలని కోరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మొత్తం 135 వినతులు వచ్చాయి. బీసీ సంఘాలతో పాటు ముదిరాజ్, రజక, నాయీ బ్రాహ్మణ, సగర, వడ్డెర, మేదరి తదితర కుల సంఘాలతో పాటు మైనార్టీ సంఘాల నాయకులు వినతిపత్రాలు సమర్పించిన వారిలో ఉన్నారు.

ఇంటింటి సర్వేను సద్వినియోగం చేసుకోండి

ఇంటింటి సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరిందని.. జంట నగరాలు మినహా మిగతా జిల్లాల్లో 85 నుంచి 90 శాతం సర్వే పూర్తయిందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 94 శాతం, వనపర్తిలో 88 శాతం, నాగర్‌కర్నూల్‌లో 84.2 శాతం, జోగుళాంబ గద్వాలలో 94 శాతం, నారాయణపేట జిల్లాలో 92.5 శాతం సర్వే పూర్తయినట్లు వివరించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికెళ్లి సమాచారం సేకరిస్తున్నారని.. సర్వే వివరాలను పూర్తిగా పబ్లిక్ డొమైన్‌లో పెట్టనున్నట్లు చెప్పారు.

■ మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర మాట్లాడుతూ.. బీసీ కమిషన్ బహిరంగ విచారణకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్, వనపర్తి కలెక్టర్లు బదావత్ సంతోష్, ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. బీసీ కమిషన్ ప్రజల వద్దకు వచ్చి ప్రత్యక్షంగా బీసీల సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రజల అభ్యున్నతికి కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు.

■ రాష్ట్ర మైనార్టీ ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ.. బీసీ జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. సయ్యద్, మోఘల్, పఠాన్‌లు ఆర్థికంగా వెనుకబడ్డారని.. వారిని బీసీ ఈ కేటగిరీలో చేర్చాలని కోరారు. అంతకుముందు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయ ప్రకాష్, తిరునగరి సురేందర్, రంగు బాలలక్ష్మిలకు కలెక్టర్ విజయేందిర, ఎస్పీ డి.జానకి స్వాగతం పలికారు. అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, లక్ష్మీనారాయణ, బీసీ సంక్షేమశాఖ అధికారులు ఇందిర, ఖాజా నజీంఅలీ, సుబ్బారెడ్డి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన బీసీ సంఘాల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

వివిధ సంఘాల అభిప్రాయాలు..

■ 50 శాతం తగ్గకుండా రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సాగర్ కోరారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమగ్ర కులగణన చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడాన్ని బీసీ సమాజం అభినందిస్తుందన్నారు.

■ దక్కన్ జాతి గొర్రెలను కాపాడాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ కోరారు. గొర్రెల పరిశోధనా కేంద్రానికి 200 ఎకరాల భూమి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

■ కోటి 20 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లకు రాజకీయ ప్రాధాన్యతలో వాటా దక్కక పోవడంతో వెనుకబడి ఉన్నారని తెలంగాణ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకుడు మైత్రి యాదయ్య అన్నారు. విద్య, సామాజిక, ఆర్థికంగా వెనుకబడి ఉన్నామని.. తమకు రిజర్వేషన్లు కల్పిస్తే అభివృద్ధి సాధిస్తామన్నారు.

■ నీలి కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు.

■ బీసీ డిక్లరేషన్‌ను అమలుపర్చాలని బీసీ సేనా జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్ కోరారు. బీసీల అభ్యున్నతికి ప్రతి ఏటా రూ. 20వేల కోట్లు కేటాయించాలన్నారు.

■ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం కోరారు.

■ దొంగ సర్టిఫికెట్ల కేటాయింపులను అరికట్టాలని బెస్త సంఘం నాయకుడు అంజయ్య కోరారు. దొంగ సర్టిఫికెట్లతో బెస్త కులం విద్యార్థులు నష్టపోతున్నారన్నారు.

జీవనోపాధి చూపాలి: ఎమ్మెల్యే యెన్నం



బీసీలకు జీవనాధారం చూపించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో సుమారు 3 కోట్ల మంది బీసీ ఓటర్లు ఉండగా.. ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య 5 లక్షలకు మించకుండా ఉందన్నారు. బీసీ బాలుర, బాలికల హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు బాలికల కోసం మరికొన్ని హాస్టళ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్‌లో మహిళల కోసం కేవలం ఒక డిగ్రీ కళాశాల మాత్రమే ఉందని.. మరో రెండు డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. బీసీ జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయించి, వారి సంక్షేమానికి ఖర్చు చేయాలని కోరారు.

బీసీ కమిషన్ ఏర్పాటు హర్షణీయం..



జోగుళాంబ గద్వాల జిల్లాలోని బీసీ వర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం బీసీ కమిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాలలో ముదిరాజ్‌లు, బోయల జనాభా అత్యధికంగా ఉందన్నారు. బీసీ–డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చడంతో పాటు బోయలను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. కమిషన్ ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని నమ్ముతున్నట్లు తెలిపారు.

తప్పు జరిగితే చర్యలు తప్పవు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు: మూడు రోజుల క్రితం మాగనూర్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు గురైన కొంత మంది విద్యార్థులను చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రి తీసుకురావడం జరిగిందని, పరిస్థితి ఆందోళనకరంగా ఉంటే సూపరింటెండెంట్‌కు ఆదేశాలు ఇస్తే అందరిని సమన్వయం చేసుకుని పడకలు ఏర్పాటు చేసి కావాల్సిన చికిత్స అందించారని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిని శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించి మొదట చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, ఆ తర్వాత డైట్ కాంట్రాక్ట్ కిచెన్‌లో ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. రోగులకు అందించే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని, ఈ ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. పిల్లల చికిత్సపై సూపరింటెండెంట్ అక్కడే ఉండి పూర్తిగా మానిటరింగ్ చేశారన్నారు. అయితే ఉదయం పిల్లలకు అల్పాహారం ఇచ్చే సమయంలో పురుగు వచ్చిందని కొంత మంది ఏదో సృష్టించాలని ప్రయత్నం చేశారని, వెంటనే అదనపు కలెక్టర్ విజిట్ చేసి తనిఖీలు చేసినట్లు చెప్పారు. ఫుడ్ కంట్రోల్ అధికారులు పూర్తిగా శాంపిల్స్ సేకరించి ఎక్కడా పురుగులు లేవని తేల్చి చెప్పారన్నారు. ఏ వార్డులో రాని పురుగులు ఈ ఒక్క విద్యార్థి టిఫిన్‌లో ఎలా వచ్చింది దీనికి వెనుక కుట్ర కోణం ఏదైనా ఉందా? లగచర్ల మాదిరిగా ఏదైనా చేశారా అనే అనుమానం ఉందన్నారు. ఆస్పత్రిలో వైద్యులు చాలా కష్టపడుతున్నారని, చిన్నపాటి పొరపాట్లు దృష్టికి వస్తే సవరిస్తున్నామన్నారు.

13 మంది డిశ్చార్జ్

మాగనూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా జిల్లా జనరల్ ఆస్పత్రి చిన్న పిల్లల విభాగంలో చికిత్స పొందుతున్న 15 మంది విద్యార్థుల్లో శుక్రవారం 13 మంది డిశ్చార్జ్ కాగా మరో ఇద్దరూ చిన్నారులు చికిత్స పొందుతున్నారు. ఇందులో ఒక విద్యార్థికి గుండెకు సంబంధించిన సమస్య ఉందని, మరో విద్యార్థినికి ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కురుమూర్తి హుండీ ఆదాయం రూ. 22,78,896



కురుమూర్తి స్వామి హుండీలోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి ఆలయంలో హుండీలను శుక్రవారం దేవాదాయశాఖ అధికారులు లెక్కించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు, జాతరను పురస్కరించుకొని భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా.. రూ. 22,78,896 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాగా, కురుమూర్తి జాతరకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని పునీతులయ్యారు. అలువేలు మంగమ్మ, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో జాతర మైదానం కిక్కిరిసి కనిపించింది. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భాస్కరాచారి, భారతమ్మ, కమలాకర్, శ్రీధర్‌రెడ్డి, శేఖర్, గోపాల్, చక్రవర్ధన్‌రెడ్డి, బాదం వెంకటేశ్వర్లు, అర్చకుడు వెంకటయ్య పాల్గొన్నారు.

భయంగానే బడికి..

- మాగనూరు జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థుల పరిస్థితి
- ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్ పాఠశాల సందర్శన.. విద్యార్థులతో కలిసి భోజనం

నారాయణపేట/మక్తల్/మాగనూర్: మాగనూర్‌లో జడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్నం భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనతో భయంగానే విద్యార్థులు రెండు రోజులుగా బడికి చేరుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం తినాలంటేనే జంకుతున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, అడిషనల్ కలెక్టర్ బేన్ షాలం పాఠశాలకు చేరుకొని కొత్తగా తెప్పించిన బియ్యాన్ని పరిశీలించారు. వారితోపాటు జిల్లా అధికారి యాదయ్య, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీఓ రహమతుల్లా దగ్గరుండి భోజన ఏర్పాటు పరిశీలించారు. ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్, ఇతర అధికారులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఇదిలాఉండగా, విద్యార్థుల అస్వస్థత ఘటనతో విద్యార్థుల హాజరుశాతం తగ్గింది. 578 మంది ఉండగా బుధవారం 455 మంది, గురువారం 229, శుక్రవారం 338 మంది పాఠశాలకు వచ్చారు. అలాగే, చాలామంది విద్యార్థులు తమ ఇళ్ల నుంచి భోజనాన్ని టిఫిన్లలో తెచ్చుకొని తింటు కానవచ్చారు.

అప్పుడే తొలగించాల్సింది..

మధ్యాహ్న భోజన నిర్వాహకుల గతంలో తప్పిదం చేసిన వెంటనే వారిని తొలగించి ఉంటే ఈ రోజు ఈ సంఘటన జరిగి ఉండేది కాదని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఉపాధ్యాయులకు సూచించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు ఉండాలన్నారు. తొలగించిన ఏజెన్సీ స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ స్పష్టం చేశారు.



ఆస్పత్రిలో అన్నం సర్వ్ చేస్తున్న డైట్ సిబ్బంది

నీళ్ల చారు.. పాలు..!

ఇదీ రోగులకు ఇస్తున్న మెనూ

- కూరలు సైతం సరిగా లేని వైనం
- జనరల్ ఆస్పత్రిలో డైట్ తీరూ తెన్నూ..
- 'సాక్షి' బృందం పరిశీలనలో ఎన్నో విషయాలు వెలుగులోకి..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/మెట్టుగడ్డ: 'నీళ్ల చారు.. పలచనైన పాలు.. కర్రీ సైతం సరిగా ఉండదు..' ఇదీ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు ఇస్తున్న డైట్. శుక్రవారం 'సాక్షి' బృందం ఈ ఆస్పత్రిని పరిశీలించగా ఎన్నో విషయాలు వెలుగుచూశాయి. ఇక్కడ 450 పడకలు ఉన్నాయి. వాస్తవానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అతి పెద్ద ఆస్పత్రి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది వస్తుంటారు. ప్రతినిత్యం స్థాయికి మించి రోగులతో కిక్కిరిసిపోతుంది. కాగా, ఇటీవల నారాయణపేట జిల్లా మాగనూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనం తిని సుమారు వంద మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జీజీహెచ్‌లో పరిశీలించగా మెనూ సరిగా ఇవ్వడం లేదని రోగులు, సహాయకులు వాపోయారు.



మెటర్నటీ వార్డులో మధ్యాహ్న భోజనం చేస్తున్న బాలింత, మహిళలు

పేషెంట్ డైట్ మెనూ వివరాలు

వారంలో ఏడు రోజులకు సంబంధించిన పేషెంట్ డైట్ మెనూ వివరాలిలా ఉన్నాయి. ప్రతిరోజూ మధ్యాహ్నంతో పాటు రాత్రివేళ అన్నం, డయాబెటిక్ వారికి చపాతి, పాలకూర పప్పు, కూరగాయల కర్రీ, సాంబర్, మజ్జిగ ఇవ్వాలి. ఇక సోమవారం ఉదయం సుజ్జి రవ్వా, పాలు, బాయిల్డ్ ఎగ్, మంగళవారం ఉదయం కిచిడి, పాలు, బాయిల్డ్ ఎగ్, బుధవారం ఉదయం రవ్వతో ఉప్మా, పాలు, బాయిల్డ్ ఎగ్, గురువారం ఉదయం పొంగల్ రైస్, పాలు, బాయిల్డ్ ఎగ్, శుక్రవారం ఉదయం సుజ్జి రవ్వతో ఉప్మా, పాలు, బాయిల్డ్ ఎగ్, శనివారం ఉదయం కిచిడీ, పాలు, బాల్డ్ ఎగ్, ఆదివారం ఉదయం పొంగల్ రైస్, పాలు, బాల్డ్ ఎగ్ ఇవ్వాలి. అయితే మెనూ ప్రకారం ఏ రోజూ సరిగా ఇవ్వడం లేదని రోగులు వాపోయారు. ముఖ్యంగా సాంబరు (పప్పుచారు), పాలలోనూ నీళ్లే ఎక్కువగా ఉంటున్నాయి. తాజాగా బెండకాయ కర్రీని సైతం పలుచగానే అందజేస్తున్నారు.

ఏయే సమయాల్లో..

ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు, డిన్నర్ రాత్రి ఎనిమిది నుంచి పది గంటల వరకు రోగులకు ఈ మెనూ అందించాలి. అయితే గంట పాటు మాత్రమే రోగులకు వద్దకు డైట్ సిబ్బంది వచ్చి ఉన్నవారికే ఇచ్చి వెళ్తున్నారు. ఆ సమయంలో కొందరు రోగులు కాలకృత్యాలకు వెళితే ఇక అంతే సంగతులు. తిరిగి అక్కడికి డైట్ సిబ్బంది రాకపోవడం గమనార్హం.



ఫ్రిజ్‌లో ఆకుకూరలు, కోసిన ఉల్లిగడ్డ ముక్కలు



సాక్షి విజిట్

అన్నీ నీళ్ల పాలే..!



నేను నిండు గర్భిణిని కావడంతో నాలుగు రోజుల క్రితం ఈ పెద్దాస్పత్రికి వచ్చాను. నిన్ననే సాధారణ ప్రసవంలో పండంటి కుమారుడు జన్మించాడు. అన్నం బాగానే ఉన్నా సాంబరు మొత్తం నీళ్ల చారే వడ్డించారు. పాలు కూడా చాలా పలుచగా ఉన్నాయి. మెనూ ప్రకారం ఏవీ సరిగా ఇవ్వడం లేదు.

– అంకిత, బాలింత, గుడిబండ, అడ్డాకుల మండలం

అధికారుల నిర్లక్ష్యమే కారణం



అధికారుల నిర్లక్ష్యం.. పర్యవేక్షణ కరువైంది. దీంతో మా పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి తీవ్ర అనారోగ్యం పాలయ్యాను. అక్కడ పాలకూరలో కుళ్లిన కోడిగుడ్లు వేసి వండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇక్కడ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాను. ఇంకా కడుపునొప్పితో బాధ పడుతున్నాను. ఈ పెద్దాస్పత్రిలో మెనూ ప్రకారం భోజనం సరిగా వడ్డించడం లేదు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– నందిని (కొత్తపల్లి), జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి, మాగనూరు

కళ్లు తిరిగినట్లవుతోంది..



మా పాఠశాలలో బియ్యం కడగకుండానే కచిబిచి వంట చేసేవారు. ఇదేమని అడిగితే ఏమీ కాదులే అని వంట ఏజెన్సీ వారు బదులిచ్చేవారు. చివరకు మధ్యాహ్నం భోజనం వికటించడంతో ఆస్పత్రి పాలయ్యాను. కడుపునొప్పి, దగ్గు విపరీతంగా వస్తోంది. ఏమీ తినబుద్ధి కావడం లేదు. కళ్లు తిరిగినట్లవుతోంది. ఈ ఆస్పత్రిలోనూ పద్ధతి ప్రకారం మెనూ పాటించడం లేదు.

– అనిల్ (ఉజ్జెల్లి), జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి, మాగనూరు

రోగులు, వైద్యులకు ఒకే భోజనం



రెండు నెలల క్రితం వరకు రోగులు, వైద్యులకు వేర్వేరుగా మెనూ వడ్డించేవారు. నేను విధుల్లో చేరిన వెంటనే డైట్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఈ పద్ధతిని మార్పించా. ప్రస్తుతం అందరికీ నాణ్యమైన భోజనం ఒకేలా అందించేలా ఏర్పాట్లు చేశాం. దీనికి సంబంధించి అతనికి తగు సూచనలు ఇచ్చాం. ప్రతిరోజూ ఆస్పత్రికి స్థాయికి మించి రోగులు వస్తున్నారు.

– డా. సంపత్‌కుమార్‌సింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్, జీజీహెచ్

మెనూ పాటిస్తున్నాం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్పత్రిలో డైట్ మెనూను తూ.చ. తప్పకుండా పాటిస్తున్నాం. ఏరోజుకారోజు కూరగాయలు జడ్చర్ల నుంచి తెప్పించి వంటల్లో వాడుతున్నాం. ప్రతిరోగికి రూ.72 చొప్పున మాకు చెల్లిస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు ఇది ఏమాత్రం సరిపోవడం లేదు. 8 నెలల నుంచి బిల్లులు రూ.కోటి వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ట్రెజరీలో రూ.46 లక్షలకు సంబంధించి టోకెన్ ఇచ్చినా ఇంకా డబ్బులు రాలేదు.

– రామస్వామి, డైట్ కాంట్రాక్టర్, జీజీహెచ్, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

అంత్యక్రియలకు వెళ్తూ.. అనంత లోకాలకు

● రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి


సుల్తాన్ (ఫైల్)

ఆత్మకూర్: బంధువు అంత్యక్రియల కోసం బయలుదేరాడు.. ఆ కార్యక్రమంలో పాల్గొనకముందే విగతజీవిగా మిగిలాడు ఓ వ్యక్తి.. ఈ హృదయ విదారక సంఘటన శుక్రవారం ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలు.. మదనాపురం మండల కేంద్రానికి చెందిన ఎండీ సుల్తాన్(75) రైస్‌మిల్లులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. శుక్రవారం మండలంలోని కత్తేపల్లి గ్రామంలో తమ బంధువు మృతిచెందడంతో అంత్యక్రియల కోసం సుల్తాన్ మదనాపురం నుంచి స్కూటర్‌పై బయలుదేరాడు. ఆత్మకూర్ శివారులోని చెరువు సమీపంలో కొత్తకోట వైపు రోడ్డుపై అతివేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో సుల్తాన్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి 108, పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకొని అతడిని ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. టిప్పర్ రాయచూర్‌కు చెందినదిగా గుర్తించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత బలవన్మరణం


స్వాతి(ఫైల్)

ఉండవెల్లి: కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఉరేసుకొని ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. మండల కేంద్రంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన మధుబాబు, కర్నూల్ జిల్లా బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన స్వాతి(20)కి రెండేళ్ల క్రితం పెళ్లైంది. వారికి 14 నెలల కొడుకు ఉన్నాడు. కొద్దినెలల నుంచి స్వాతి కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈనెల 20వ తేదీన కూడా ఆసుపత్రిలో చికిత్స చేయించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం కడుపునొప్పి భరించలేక స్వాతి ఇంట్లో ఉరేసుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు భర్తకు సమాచారం ఇచ్చారు. మధుబాబు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను అక్కడికి చేరుకొని తలుపులు బద్దలుకొట్టి ఉరేసుకున్న భార్యను చూసి బోరున విలపించాడు. భర్త మధుబాబు పుట్టిన రోజునే భార్య మృత్యువాత పడింది. మృతురాలి తల్లి మలేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతిచెందినట్లు ఎస్సై గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. అచ్చంపేటకు చెందిన మదర్‌బీ (58) గురువారం మధ్యాహ్నం నాగర్‌కర్నూల్‌కి ఆర్టీసీ బస్సులో వచ్చింది. రవీంద్ర టాకీస్ చౌరస్తా వద్ద బస్సు నుంచి దిగుతూ కిందపడింది. ఆమెకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

నారాయణపేట: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని అభంగాపూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అభంగాపూర్ గ్రామానికి చెందిన భీమప్ప(30) ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఏబీ స్విచ్ ఆఫ్ చేయడానికి వెళ్లాడు. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐఎంఎల్ నాయకులు డిమాండ్ చేశారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని వీరన్నపేట రైల్వేగేట్ సమీపంలో శుక్రవారం రాత్రి 10గంటల ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ(35) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

అచ్చంపేట: మండలంలోని నడింపల్లి శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రమేష్ వివరాల మేరకు.. అచ్చంపేట వలపట్ల కాలనీకి చెందిన మీసాల వినోద్‌కుమార్ (29) హాజీపూర్ నుంచి బైక్‌పై పట్టణానికి వస్తూ.. నడింపల్లి వద్ద అదుపుతప్పి రోడ్డుపక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనక నుంచి ఢీకొట్టాడు. అతడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ అస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జోగుళాంబ వారోత్సవాలు


అభిషేక పూజల్లో మేయర్ పారిజాతారెడ్డి, కుటుంబ సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం వారోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం యాగశాలలో భక్తులతో సామూహిక చండీహోమాలు చేయించారు. అలాగే మధ్యాహ్నం త్రిశతి, ఖడ్గ మాల అర్చనలు చేశారు. పలువురు భక్తులు సంతాన భాగ్యం కోసం స్వామివారి ఆలయం దగ్గర రేణుకాదేవికి శ్రీ సూక్త సహితంగా అమ్మవారికి అభిషేకాలు చేసి నవనీత నైవేద్యం సమర్పించారు. కుంకుమార్చన మండపంలో దర్బార్ సేవలు చేశారు. బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. కార్తీక మాసం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తుంగభద్ర నదిలో స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు.

కనులపండువగా రథోత్సవం..

వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం జోగుళాంబ అమ్మవారి ఆలయంలో రథోత్సవం నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోని ప్రాకార మండపంలో ఊరేగించారు. అలాగే అమ్మవారికి దశవిధ హారతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు..

దేవస్థానం ఆవరణలో అన్నమాచార్య ప్రాజెక్టు వారు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. అలాగే హైదరాబాద్ మణికొండ ఉమాకాశీనాథ ఆలయం నుంచి వచ్చిన భక్తులు లలిత, విష్ణు సహస్రనామ పారాయణాలు పఠించారు. దేవస్థానం వారు వచ్చిన భక్తులకు బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భోజన సదుపాయం కల్పించారు. సమీపంలోని సంగమేశ్వర, పాపనాశిని, నవబ్రహ్మ ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది.

ప్రముఖుల సందడి..

అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం పశుసంవర్ధకశాఖ ప్రభుత్వ కార్యదర్శి అమయ్‌కుమార్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సీఐ రాజేశ్వరి, ఏఈ కిశోర్‌కుమార్‌రెడ్డి , హైదరాబాద్ బడంగ్‌పేట మేయర్ పారిజాతారెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, హైదరాబాద్ విజిలెన్స్ సీఐ వెంకటరంగారెడ్డి, దేవాదాయశాఖ జ్యువెలరీ వెరిఫికేషన్ అధికా రి అంజలాదేవి తదితరులు దర్శించుకున్నారు.


చండీహోమాలు చేస్తున్న భక్తులు


ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్కియాలజికల్ సీఐ రాజేశ్వరి, ఏఈ కిశోర్‌కుమార్‌రెడ్డి


పశుసంవర్ధకశాఖ కార్యదర్శి అమయ్‌కుమార్‌ను శేషవస్త్రంతో సత్కరిస్తున్న అర్చకుడు

విద్యార్థినులను వేధించిన ఉపాధ్యాయుడు

అమ్రాబాద్: పదర మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో తల్లిదండ్రులకు తెలిపారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి నిలదీయడంతో విషయం వెలుగు చూసింది. ఈ విషయంపై మండల విద్యాధికారి బుచ్చిబాబుని వివరణ కోరగా విద్యార్థినులు, ఉపాధ్యాయుడితో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేస్తానని సమాధానమిచ్చారు. కాగా శుక్రవారం షీటీం హెడ్ కానిస్టేబుల్ పద్మ, కానిస్టేబుల్ వెంకటేశ్, చైల్డ్ వెల్ఫేర్ సభ్యురాలు ప్రమీల పాఠశాలకు వచ్చి వివరాలు సేకరించినట్లు తెలిసింది. అనంతరం విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టాలని, విద్యార్థినులపై వివక్ష చూపరాదని తెలిపారు.


బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు





తెలంగాణ ప్రభుత్వ చిహ్నం మారిందా..?

అధికార చిహ్నం మార్చాలన్న ఆలోచనలో ఉంది తెలంగాణ సర్కార్. కానీ మహబూబ్‌నగర్‌లో అధికారులు ఏకంగా మార్చేసి ఫ్లెక్సీపై ముద్రించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన వెనుకబడిన తరగతుల కమిషన్ సమావేశంలో పాత చిహ్నం, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై కొత్త చిహ్నం కనిపించాయి. - మెట్టుగడ్డ

ఆలయంలో చోరీ

25తులాల వెండి, తులం బంగారం అపహరణ

మహమ్మదాబాద్: మండలంలోని బల్సుర్‌గొండ గ్రామం బయట ఉన్న శివాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని 25తులాల వెండి, తులం బంగారం అపహరించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శివాలయంలో చోరీ చేశారు. శుక్రవారం ఉదయం కొందరు గ్రామస్తులు చూసి పెద్దలకు సమాచారం అందించారు. దీంతో అదే గ్రామానికి చెందిన గొల్ల అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.200 అప్పు చెల్లించలేదని దాడి

లింగాల: అప్పుగా తీసుకున్న రూ.200 చెల్లించలేదని అప్పు ఇచ్చినవారు దాడికి పాల్పడగా ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మండలంలోని అవుసలికుంటలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురుమయ్య అదే గ్రామానికి చెందిన గుండూరు శ్రీను వద్ద కొన్నిరోజుల క్రితం రూ.200 అప్పుగా తీసుకున్నాడు. ఇటీవలే ఆ డబ్బులను తిరిగి చెల్లించినట్లు బాధిత వ్యక్తి కుటుంబ సభ్యులు తెలిపారు. డబ్బులివ్వ లేదని భావించిన శ్రీను అతని తమ్ముడు ఇంటి వద్ద ఉన్న కురుమయ్యతో గొడవకు దిగారు. ఇది గమనించి ఇరుగు పొరుగు వారు సర్ది చెప్పి వారిని పంపించేశారు. కొద్దిసేపటి తర్వాత శ్రీను, అతను తమ్ముడు మళ్లీ కురమయ్య ఇంటికి వచ్చి కర్రలతో దాడికి పాల్పడ్డారు. దీంతో అతను స్పృహతప్పి పడిపోగా కుటుంబ సభ్యులు లింగాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాటన్‌మిల్లులో అగ్నిప్రమాదం

తెలకపల్లి: మండలంలోని రాంరెడ్డిపల్లి, చిన్నముద్దునూరు గ్రామాల మధ్య ఉన్న వినాయక కాటన్‌మిల్లులో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కాటన్‌మిల్లు నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం మిల్లులో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. అప్పటికే ప్రమాదంలో మిషన్లు, సెల్వార్లు, బెల్టులు, కొంత మేరకు పత్తి కాలిపోయాయి. ప్రమాదంలో దాదాపు రూ.20 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.లక్ష నష్టం

గద్వాల క్రైం: పత్తి మిల్లులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈసంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల–మెలచెర్వు రోడ్డు మార్గంలోని వీరన్నగౌడు పత్తి మిల్లులో పత్తిని కూలీలు మిషన్ ద్వారా వేరు చేస్తున్నారు. ఈ తరుణంలో వేడి ధాటికి నిప్పురవ్వలు వచ్చాయి. పత్తి కాటన్లపై నిప్పురవ్వలు పడటంతో మంటలు వ్యాపించాయి. క్షణాల్లో కూలీలు, మిల్లు వర్కర్స్ మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు మిల్లు యజమాని తెలిపారు.


తెలకపల్లి: వినాయక కాటన్ మిల్లులో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆర్‌యూబీ ప్రారంభం.. ఆలస్యం!

● డిసెంబర్ మొదటి వారంలో..
● రైల్వే నిగం అధికారుల నుంచి లేఖ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రైల్వేస్టేషన్ వద్ద నిర్మిస్తున్న ఆర్‌యూబీ ప్రారంభోత్సవం మరింత ఆలస్యమవుతోంది. ఈనెల 25న ప్రారంభిస్తారని పట్టణంలో ప్రచారం చేశారు. ఈ క్రమంలో డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభిస్తామని దక్షిణ మధ్యరైల్వే నిగం అధికారుల నుంచి పాతబజార్‌కు చెందిన సామాజిక కార్యకర్త కంచుకోట ఆనంద్‌కు మంగళవారం లేఖ వచ్చింది. గతనెల చివరి వారంలో ఆర్‌యూబీని సందర్శించిన ఎమ్మెల్యే నవంబర్ నెలలోనే ప్రారంభించేలా చూస్తామని ప్రకటించారు. మరో పదిహేనురోజులు వేచి ఉండక తప్పదని రైల్వేశాఖ లేఖ ద్వారా తేలిపోయింది. కొత్తబజార్, పాతబజార్‌లను విడదీస్తున్న రైల్వేగేట్ సమస్య పరిష్కారం కోసం గతేడాది మార్చిలో ఆర్‌యూబీ నిర్మాణ పనులు ప్రారంభించారు. పదినెలల్లో పూర్తి కావాల్సిన పనులు ఏడాదిన్నర కాలం పట్టింది. 2023 ఫిబ్రవరి నెల నుంచి రైల్వేగేట్ పూర్తిగా మూసేసి రాకపోకలు నిలిపేశారు. మరోవైపు సిగ్నల్‌గడ్డపై రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. ఆర్‌యూబీ ప్రారంభమైతే కొంతమేర సమస్యకు చెక్‌పెట్టినట్లవుతుంది.

రూ.11కోట్లతో నిర్మాణం

రూ.11కోట్లకుపైగా నిధులతో ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టారు. ఆర్‌యూబీ 11 ఫీట్ల ఎత్తు, 16.5అడుగుల వెడల్పుతో రెండు బ్లాగ్స్ (మొత్తం 11మీటర్లు (35అడుగులు)తో నిర్మించారు. వచ్చే వాహనాలు ఒకవైపు వెళ్లే వాహనాలకు మరోవైపు బ్లాగ్స్‌ద్వారా వెళ్లేలా రాకపోకలకు డిజైన్ చేశారు. పాతబజార్ గాంధీ విగ్రహం నుంచి పోస్టాఫీస్ వరకు నిర్మించిన ఆర్‌యూబీ పనులు దాదాపు పూర్తై తుదిమెరుగులు దిద్దుతున్నారు. రెండువైపులా 10అడుగుల సర్వీస్‌రోడ్లు సైతం పూర్తి చేశారు. దీంతో పాటు వర్షపునీరు నిల్వ లేకుండా ఉండేందుకు రైల్వేలైన్ పక్కనుంచి మినీట్యాంక్‌బండ్‌లోకి పైప్‌లైన్ పనులు ఇటీవల పూర్తయ్యాయి.

సామాజిక కార్యకర్త ప్రశ్నకు జవాబు

ఆర్‌యూబీ ప్రారంభం ఎప్పుడంటూ పాతబజార్‌కు చెందిన సామాజిక కార్యకర్త కంచుకోట ఆనంద్ దక్షిణమధ్య రైల్వేశాఖ అధికారులను ప్రశ్నిస్తూ పదిరోజులక్రితం ఓ లేఖ రాశారు. దానికి స్పందించిన అధికారులు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభిస్తామని సమాధానమిస్తూ లేఖను పంపించారు. ఆర్‌యూబీ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నిర్మాణం చేశారు. భవిష్యత్‌లో కష్టాలు ఎలా? అంటూ ఆ లేఖలో ప్రశ్నించారు. జిల్లా అథారిటీ సూచనల మేరకే ఆర్‌యూబీ నిర్మాణం చేసినట్లు సమాధానం ఇచ్చారు.


ముస్తాబైన ఆర్‌యూబీ


రాకపోకలు లేకుండా రోడ్డుకు అడ్డుగా పెట్టిన రేకులు

విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలి

● డీఈఓ ప్రవీణ్‌కుమార్
● హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో విద్యార్థులు రాణించాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లాకు చెందిన పి.జయవర్ధన్‌రెడ్డి (అపెక్స్ సెంట్రల్ స్కూల్, మహబూబ్‌నగర్), పి.లాస్యప్రియ (మహబూబ్‌నగర్ హైస్కూల్) విద్యార్థులు జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం డీఈఓ విద్యార్థులను అభినందించారు. ఇటీవలే హుస్నాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ టోర్నీలో ప్రతిభ చాటారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఈనెల 25నుంచి 29వరకు జాతీయస్థాయి పోటీలు జరుగుతాయి. సీఎంఓ బాలు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, పీడీ వేణుగోపాల్, మహబూబ్‌నగర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ శాంత, ఎండీ.జియావుద్దీన్, అహ్మద్ హుస్సేన్, శివుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో చాంపియన్‌గా నిలవాలి


ఉమ్మడి జిల్లా బాలుర సాఫ్ట్‌బాల్ జట్టుతో పీడీలు

● జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర
● మూసాయిపేట తరలిన సాఫ్ట్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ బాలుర జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా నిలవాలని జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర అన్నారు. మెదక్ జిల్లా మూసాయిపేటలో శని, ఆదివారం జరిగే సబ్ జూనియర్ బాలుర రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనేందుకు ఈ జట్టు శుక్రవారం సాయంత్రం తరలి వెళ్లింది. ఈ సందర్భంగా జట్టును ఆయన అభినందించారు. కార్యక్రమంలో కోచ్ సాదిక్‌అలీ, పీడీలు నాగరాజు, రాఘవేందర్, నాగమణి, సుగుణ, మేరి పుష్ప, జంగయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ బాలుర జట్టు

ఎస్.సందీప్, వై.రంజిత్, ఎల్.అరవింద్, వి.ఓంకార్, గోపిచందు, కె.ఉదయ్‌కిరణ్, వి.శివకుమార్, రాజేందర్, వి.కార్తీక్, సిద్దార్థ్, జుబేర్, కె.సందీప్, సాయిచరణ్, ఎ.చరణ్, వర్షిత్, జి.నాగరాజు. కోచ్, మేనేజర్లుగా కిరణ్, శ్రీను, మోహన్ వ్యవహరిస్తున్నారు.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారంపూర్తిస్థాయి నీటిమట్టం 1,021అడుగులకు చేరింది. జూరాల ఎడమకాల ద్వారా 390 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. సమాంతర కాలువ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాలువ ద్వారా 800 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాలువల ద్వారా 25 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

ఒక గేటు ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంలో ఒక గేటు ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. శుక్రవారం ఎగువ నుంచి 3813 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. 1,368 క్యూసెక్కులు దిగువకు వదిలి కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.

జూరాలకు స్వల్ప వరద

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు 3,500క్యూసెక్కులు ఉన్నాయి. ఆవిరి రూపంలో 72క్యూసెక్కులు, ఎడమ కాలువకు 390 క్యూసెక్కులు, కుడి కాలువకు 54 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 630 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,166 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.542 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కేఎల్‌ఐ కాల్వలో పడి వృద్ధుడు గల్లంతు

నాగర్‌కర్నూల్ క్రైం: కేఎల్‌ఐ కాల్వలో పడి వృద్ధుడు గల్లంతైన సంఘటన మండలంలోని గుడిపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుడిపల్లి గ్రామానికి చెందిన బంగారయ్య (65) పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటికి పోయి గ్రామసమీపంలోని కేఎల్‌ఐ కాల్వలోకి దూకాడు. గ్రామస్తులు గమనించి పోలీస్‌లకు, ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక శాఖాధికారులు కాల్వ వద్దకు చేరుకున్నారు. కాల్వకు పారే నీటిని నిలిపివేశ బంగారయ్య మృతదేహం కోసం గాలించారు. సాయంత్రం వరకు దొరకకపోవడంతో గాలింపును ఆపేశారు. సంఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గోవర్దన్ తెలిపారు.

మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: మహిళ మృతదేహం లభ్యమైన ఘటన శుక్రవారం పట్టణంలోని జూరాల కుడికాలువలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బీసీ కాలనీకి చెందిన రాములమ్మ(48) రెండు రోజుల క్రితం కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. భర్త గోకారి, కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వాకబు చేశారు. ఫలితం లేకుండా పోయింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం హమాలీకాలనీ సమీపంలో జూరాల కుడి కాలువలో మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాములమ్మ మృతదేహంగా గుర్తించారు.

వేధింపుల కేసులో మూడేళ్ల జైలు శిక్ష


నిందితుడు కృష్ణమూరి

అమరచింత: భార్యను శారీరకంగా, మానసికంగా వేధించిన కేసులో భర్తకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. అమరచింతకు చెందిన బోయ రాధమ్మ, కృష్ణమూర్తి దంపతులు. 2017సంవత్సరంలో రాధమ్మ తన భర్త వేధిస్తున్నాడని అప్పటి ఎస్సై సత్యనారాయణ రెడ్డికి ఫిర్యాదుచేసింది. హెడ్‌కానిస్టేబుల్ జమీరుద్దీన్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ఆత్మకూరు సివిల్ కోర్టు జడ్జి నిందితుడికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధించారన్నారు. బాధితుల తరఫున కేసును వాదించిన ప్రభుత్వ న్యాయవాది అరుణోదయకుమార్, సీడీఓ బాలరాజును ఎస్పీ గిరిధర్‌రావు అభినందించారని ఎస్‌ఐ తెలిపారు.



